మద్యపానంచేసి మన లోకంలో లేనప్పుడు, మతి భ్రమించినప్పుడూ మనిషి ప్రవర్తన ఊహించలేని విధంగా మారిపోతుంది. ఆ స్థితిలో చేసే పనులకు ఎవరు బాధ్యత వహించా లన్నది వివాదాస్పదమైన విషయం. అవగుణమైనా, శుభలక్షణమే అయినా మనిషి స్వభావానికి పట్టుగొమ్మగా ఉండేదే అలాంటి స్థితిలో ప్రకోపిస్తుంది, మరి!

రమణయ్య పంతులు నిస్సత్తువగా మెట్లు దిగి వీథిలో అడుగు పెట్టాడు. 'ఇంట్లోనుంచి పాప ఏడుపు ఇంకా వినిపిస్తూనే ఉంది.

"ఊరుకో అమ్మా, తాతగారు వెళ్లారుగా. నీకు కావలసినవి అన్నీ తీసుకువస్తారు. ఊరుకో మరి" అనే ఓదార్పు వాక్యాలుకూడా చెవిని సోకాయి.

బరువుగా నిట్టూరుస్తూ ముందుకు కదిలాడు రమణయ్య పంతులు. కుడిచేతివైపు గోడమీదనించి పుల్లవిరిగిన నారింజచెట్టు కనిపించింది. నిత్యం తను ఆ చెట్టు చూస్తూనే ఉన్నాడు. 'నువ్వూ నేనూ ఒకటేలే!' అని ఆ చెట్టు తనతో జాలిగా అంటున్నట్టు ఉంటుంది. మరొక నాలుగడుగులు వేసిన తరవాత, ఎడమచేతివైపు శిథిలావస్థలో ఉన్న డాబా ఒకటి ఎప్పుడూ కనిపిస్తుంది. అందులో ఎవ్వరూ ఉండడం లేదేమో? ఇంకొంచెం దూరం పోయేసరికి, సూర్యనారాయణగారి పెరట్లోంచి వచ్చిగా కలకల్లాడుతున్న పెద్ద బాదంచెట్టు తనని చూసి రోజూ ఎగతాళిగా నవ్వుతుంది!

ఆ ఇరుకు సందు దాటి, రోడ్డుమీది కోలాహలంలో ప్రవేశించినప్పుడు, చేతిలోని చారల జంబుఖానా సంచి జ్ఞాపకం వస్తుంది. 'రోజూ ఈ సంచీతో తను ఎన్నో సామాన్లు తీసుకువెళ్లాలి. మోయలేనన్ని సరుకులు ఇంటికి పట్టుకుపోవాలి' అనుకుంటాడు. కాని... సంచీనిమాత్రమే నిత్యం మోస్తున్నాడు! ఒకసారి నిట్టూర్చి నెమ్మదిగా కదులుతాడు.

ఈరోజూ అంతే జరిగింది.

స్త్రీలోలుడికీ, వద్దనుకున్నా గుర్తువచ్చే వారకాంతవంటి ఆలోచన లెప్పుడూ అతన్ని వదలిపెట్టవు.

'ఇంత విశాల ప్రపంచంలో ఏ ఒక్కరూ తనలాగ బాధలు పడటంలేదా? అంతా పైకి ఆనందంగానే కనిపిస్తారు! నిజంగా వాళ్ళు ఆనందాన్నే పొందుతున్నారా? ఊహుఁ. లేదు. పైకి అలా కనిపిస్తారు అంతే. నూటికి తొంభైమంది ఎప్పుడూ తనకన్నా ఎక్కువ కష్టాల్లోనే ఉంటారు.' ఇలా ఆలోచిస్తున్నప్పుడు అతనికి ఎందుకో కొద్దిక్షణాలు ఒకవిధమైన తృప్తి కలుగుతుంది. అంతలోనే ఇంటి పరిస్థితులన్నీ వరసగా గుర్తువస్తాయి. గుండెలు విషాదంలో నిండిపోతాయి.

'అరవై రూపాయల సంపాదనతో గుండిగెడు సంసారాన్ని బరువుగా మోసుకురావాలి. తన తాత తండ్రులు ఒకప్పుడు నేతులు తాగారు. మేడలు కట్టారు. భూములు కొన్నారు. అవన్నీ పాత రోజులు. తరాలు దొర్లి తనవరకు వచ్చేసరికి భూములూ మేడలూకూడా చల్లగా జారిపోయాయి. ఆఖరికి తనకు ఇంత నీడ ఇస్తూ, ఖాళీ అగ్గిపెట్టెలాంటి ఒక్క పెంకుటిల్లుమాత్రం మిగిలింది. తను నేతులు తాగకపోతే పోయె. మేడలు లేపకపోతే పోయె. ఉన్న ఈ ఇంటికి పదేళ్లనుంచీ సున్నంకూడా వేయించలేక పోతున్నాడు. ఆ ఇల్లూ, ఇంట్లో తను, తనతోపాటు డజనుమంది మనుష్యులు మిగులు, చింకిజల్లెడల్లాగ. దిగుళ్ళూ, రోగాలే తోడు. కాంతం నిత్యరోగి. ఏవో టానిక్కులూ, మందులూ పోస్తూనే ఉండాలి. ఎక్కడ నుంచి తేవాలి? తిండి సయించదంటుంది. ఒక పూటే కతుకుతుంది. మరోపూట పండో, కాయో తప్పకుండా కావాలి. తిన్న కాస్తయినా ఒంటబట్టదు. కడుపులో పోట్లూ, నీరసం; ఎప్పుడూ ఏదో ఒక బాధే. ఒకరోజున లేస్తే, మూడురోజులు మంచం దిగదు!

'పక్కింటి వాళ్లిచ్చిన కొబ్బరిచెక్క గుంజ కత్తిపీటతో తీసుకోబోయి వేలు తెగగోసుకుంది సీత. మూడోనాటికి చీముపోసి వేలంతా వాచిపోయింది. "ఇంక మందు అక్కర్లేదు; అదే మానిపోతుందిలే" అన్నాట్ట, రెండురోజులు మందు వేసిన డాక్టరుగారు మూడోనాడు. అవును మరి. ఆయన అడిగిన మూడు రూపాయలూ పంపించలేదు తను. పదిరోజులనుంచీ దాని వేలి సలుపు ఎక్కువే అవుతూంది. ఏం జరుగుతుందో?

'రాఘవులు పదిహేను రోజుల కొకసారి ఆ పాడు ఆయాసంతో చుట్టపెట్టుకుపోతాడు. అదేం మాయ జబ్బో? ఆయాసం భరించలేక మెలికలు తిరుగుతూ ఎగిరెగిరి పడతాడు. ఎప్పుడో ఆ ఆయాసంలోనే వాడి గుండె ఆగిపోతుందేమోనని భయం వేస్తుంది. తన ఆశలన్నీ వాడిమీదే మరి. ఈ ఏడాది గడిస్తే వాడు స్కూలుఫైనలైపోయి తనకు అందివస్తాడు. పెద్దవాడు ఎలాగూ తనకు కాకుండాపోయాడు. వీడైనా భవిష్యత్తులో తనను ఆదరిస్తాడనీ, ఆశలు తీరుస్తాడనీ, రిటైరుకాబోతున్న తన భారాన్ని తగ్గిస్తాడనీ ఆశ.

'పెద్దవాడు ఉద్యోగంలో ప్రవేశించాక ఎలాగో ఒక ఇంటివాణ్ణి చెయ్యగలిగాడు తను. వాడు మరొక ఊరు బదిలీ చేయించుకుని భార్యతో గడిపేస్తున్నాడు. ఈ ముసలితండ్రిని గురించి ఒక్క పిసరుకూడా ఆలోచించలేదు. వాడి స్వార్థమేదో వాడిది. ఊఁ. పోయింది పిల్ల. రాఘవులినైనా తనకు దక్కేలా చేస్తే చాలు భగవంతుడు.'

చిన్నగా నిట్టూర్చాడు రమణయ్య పంతులు. నెమ్మదిగా నడిచి వెళ్లిపోతున్నాడు.

'రెండేళ్లక్రితం భర్తను కోల్పోయిన పాతికేళ్ల సరోజ రెండు సంవత్సరాల పాపతో తన పంచ చేరింది. ఏ జన్మలో చేసిన పాపమో దాన్ని ఇలా పీడిస్తోంది. మానసికమయిన అశాంతితోపాటు బీదతనంకూడా దాన్ని చుట్టుకుంది. ఈ ఇంట్లో తిండీ బట్టా కూడా సరిగా దొరకవని దానికీ తెలుసు. అయినా ఇక్కడే ఉండాలి. తనేం చేస్తాడు? దాని పెళ్లికి చేసిన అప్పు

**ఆకొండి వెంకటరత్నం**

ఇంకా ఇంకా పెరుగుతూనేఉంది. ఇంకా తనకు ఏడుగురు ఆడపిల్లలున్నారు. అందులో పెళ్లికి ఎదిగిన వాళ్ళు ముగ్గురు. ఈ ఇంట్లో వాళ్లకు చదువులూ లేవు, పెళ్ళిళ్లూ లేవు. తను దిగులుతో కుంగిపోవడం తప్ప ఏదీ చెయ్యలేకపోతున్నాడు.' నిట్టూర్పుల మధ్య నీరసించిపోతున్నాడు.

రమణయ్య పంతులు ఆగి చుట్టూ చూశాడు. గాంధీనగరం పార్కు ముందున్నాడు. మనస్సు చికాకుగా ఉన్నప్పుడు అప్రయత్నంగా అక్కడికే వస్తాడు తను. అది బాగా అలవాటైపోయింది.

గేటువారగ వేరుసెనగలు తట్ట వెనకాతల కూర్చుని మామూలుగానే ఉన్నాడు తాత. రమణయ్య పంతుల్ని చూడగానే చిన్నగా నవ్వాడు.

తాత ఇచ్చిన మూడుపైసల బఠానీలగా జేబులో పోసుకుని పార్కులోకి కదిలాడు. సమస్యలు వేధిస్తున్నప్పుడు, నిస్సహాయత నెత్తిమీద కూర్చున్నప్పుడు పార్కులోకి వచ్చి కూర్చుంటాడు తను. కర్తవ్యాన్ని గురించి గంటల తరబడి ఆలోచిస్తాడు అయిపోతాయేమో అన్నట్టు, ఒక్కొక్క బఠానీగింజా నెమ్మదిగా నములుతూ.

మామూలుగా కూర్చునే సిమెంటు బెంచీవద్దకు వచ్చి, చేతిసంచితో ఒకసారి దులుపుకుని కూర్చున్నాడు. సంచీని చూస్తూ దీర్ఘంగా నిట్టూర్చాడు.

దూరంగా పిల్లలు ఆడుకుంటున్నారు. రేడియో ఏదో పాడుతూంది. అతనికి ఇవేవీ తెలియడంలేదు. ఆలోచనల్లో పూర్తిగా మునిగిపోయాడు.

'స్కూలునుంచి సాయంత్రం ఇంటికి రాగానే సంచీ చేతికిచ్చిన కాంతం, ఇలాంటి పది సంచులు పట్టినన్ని సరకుల జాబితాకూడా చేతిలో కుక్కింది. నాలుగు రోజులకుగాని ఒకటో తారీఖు రాదు. ఒకటో తారీఖు రాకమానదు. కాని జీతంమాత్రం వస్తుందో రాదో తెలియదు. ఇలాంటి పరిస్థితిలో ఇన్ని సామాన్లు ఎలా తేవడం?

"బియ్యంమాత్రం ముఖ్యం, సాయంత్రానికి అరసోలడే ఉన్నాయి" అని కాంతం హెచ్చరించింది కూడా. తన మనస్సులో ప్రతిక్షణం హెచ్చరిస్తూనే ఉంది.

"నాన్నగారూ, తమ్ముడికి మధ్యాహ్నమే కొద్దిగా ఆయాసం ప్రారంభించింది. స్కూలుకుకూడా వెళ్లలేదు. వచ్చేటప్పుడు డాక్టర్‌గారిని తీసుకురండి" అంది సరోజ.

"తాతదారూ...మూడు చక్రాల సైకిలు తోని పెత్తరా ... నాతు తావాలీ ... తొంతారా ... తొనరా, తొనాలీ..." నాలుగేళ్ల మనుమరాలు మారాం ప్రారంభించింది.

"నాన్నగారూ ... వాళ్లపాప మొన్ననే బోల్డు పరికిణీలు కుట్టించుకుంది. మీరెప్పుడూ కుట్టించరు నాకు."

"తాతదారూ ... బిత్తత్తులు తెత్తారా మరీ?..."

"నాన్నగారూ ... నాకుకూడా గౌన్లు ..."

"నేనూ బజారుకి రానా, నాన్నారూ?"

"నేనూ వస్తానండీ."

"నేనో మరి?"

'లోపలినుంచి రాఘవులి మూలుగు బాధగా విని

# యవనిక



పిస్తోంది. చంటిది ఏడుపు మొదలుపెట్టింది. కమలని, సావిత్రిని, రమని ఎలాగో తప్పించుకుని, చంటిదాన్ని బుజ్జగించి, సంచీ పుచ్చుకుని వీధిలో పడ్డాడు తను, కోరికలను మోసుకుంటూ.

'నిజమే, అన్నీ కోరికలే. తీర్చవలసిన బాధ్యత తన మీద ఉంది. అందరి అవసరాలూ తీర్చడం తన విధి కూడా. అందరినీ సంతృప్తిపరచాలనీ, సంతోషపరచాలనీ తనకూ ఉంది ఒక కోరిక. అసమర్థతవల్ల తన కోరిక తీరడంలేదు. క్రితం సంక్రాంతికి కుట్టించిన ఒక్కొక్క జత తప్పించి మళ్ళీ కొత్తబట్టల ముఖం ఎరగరు పిల్లలు. కాంతానికి ఉన్నవి ఆ రెండు చీరలేనని తనకు రెండేళ్ళ క్రితమే తెలుసు. మొన్న దసరాకి చంటిదాని కూడా ఒక్క గౌను కుట్టించలేదు.

‘ “తొత్త చొత్తా తావాలే, అమ్మా...” అంటూ చంటిది తల్లి కాళ్లను కావలించుకుని వెక్కి వెక్కి ఏడుస్తుంటే తనేం చెయ్యగలిగాడు ఆరోజు? తనే ఏమీ చెయ్యలేకపోయినప్పుడు ఆతల్లిమాత్రం ఏంచేస్తుంది? కళ్ళు ఒత్తుకుంటూ చంటిదాన్ని ఎత్తుకుని పెరట్లోకి తీసుకువెళ్ళిపోయింది. తను మనస్సులోనే తలబాదుకుని ఏడిచాడు. ఛ, తను ఏమీ చాతకాని వాడై పోతున్నాడు. ఎందుకూ పనికిరాకుండా పోతున్నాడు. అసంతృప్తినీ, ఆవేదననీ అందరికీ పంచిపెడుతూ బలవంతంగా మింగిస్తున్నాడు. ఏమిటీ బ్రతుకు? ఎందుకిలా బ్రతకడం? సుఖాని కెప్పుడూ క్రోసెడు దూరంలో పరిగెత్తుతూ, అలిసిపోతూ, ఎందుకీ జీవితాలు?'

రమణయ్య పంతులు గుండెలు బరువెక్కిపోయాయి.

కళ్లలో నీరు గూడుకట్టింది. ఎంతోసేపు అలాగే కూర్చున్నాడు.

తిరిగి బియ్యం మాట గుర్తువచ్చేసరికి హృదయం టపటపలాడింది.

'అవును. ముఖ్యంగా బియ్యం తీసుకువెళ్లాలి' అనుకుంటూ వేడి నిట్టూర్పు విడిచాడు. 'తన చేతిలో సంచీ ఉంది. అంగడిలో బియ్యమూ ఉన్నాయి. జేబులుమాత్రం సున్నాలు చుడుతున్నాయి! ఎలా? ఈ పూట పిల్లలకుకూడా బియ్యం చాలవు. తనకు అరువుఇచ్చే అంగడివాడు ఎవరు? ఇప్పటికే మూడు చిల్లర దుకాణాల్లో అరవై రూపాయలదాకా అరువు పెట్టాడు. డబ్బు ఇచ్చేదాకా వాళ్లు మళ్లీ ఇవ్వరని తనకూ తెలుసు. పోనీ, అప్పు ఇచ్చేవారైనా దొరికితే బావుండును. రామారావుగారికి పదిహేను, మోహనరావుకి పది, సుందరరావుగారికి ముప్పై, సుబ్బారావుకి పాతికా ఇవ్వాలి తను. మళ్లీ వెళ్లి వాళ్లనే అడగాలంటే ముఖం చెల్లదు. ఇప్పుడెలా? పిల్లలు ఈపాటికే ఆకలాకలంటూ ఉంటారు.'

రమణయ్యపంతులు తెగిపోయిన గాలిపటంలా ఆలోచనల ఆకాశంలో తేలిపోతున్నాడు. మధ్య మధ్య నిట్టూరుస్తున్నాడు. ఈదురుగాలివంటి దుఃఖాన్ని తట్టుకోలేకపోతున్నాడు.

అలా ఎంతసేపు కూర్చున్నాడో అతనికే తెలియదు. ఒక మృదువైన హస్తం భుజంమీద పడినప్పుడు ఈ లోకంలోకి నెమ్మదిగా దిగజారాడు. పక్కనే కూర్చున్న ఒక వ్యక్తిని చూసేసరికి అతని ఆలోచనలు పూర్తిగా తొలిగిపోయాయి. ఆ స్థానంలో ఆశ్చర్యం చోటు చేసుకుంది. ఆ వ్యక్తిని తను ఇదివరకు ఎప్పుడూ చూడలేదు. తన ముఖంలోకి దీక్షగా చూస్తున్నాడు అతను. అతను పైజామా, లాల్చీ వేసుకున్నాడు. ముప్పై ఏళ్లలోపు ఉంటాయి. తనను ఎందుకు పిలిచాడో తెలియదు!

"అలా చూస్తారేం, మాస్టారూ? నేనే మిమ్మల్ని పిలిచింది. ఏమీ అనుకోకండి" అంటూ అతనే ముందు మాట్లాడాడు.

"నా పేరు రాజా. ఏమీలేదు, కాస్త ఈ బొమ్మ ఎలా ఉందో చూసి చెబుతారని పిలిచాను, మేస్టారూ" అంటూ రాజా ఒక తెరిచిన డ్రాయింగ్ పుస్తకాన్ని అందించబోయాడు.

"నాకు డ్రాయింగ్ రాదండి."

"కాదు, మాస్టారూ, మీకు డ్రాయింగ్ రానక్కరలేదు. చూసి, బాగుందో లేదో చెప్పండి. అంతే" అంటూ పుస్తకం రమణయ్య పంతులు కళ్లముందు ఉంచాడు రాజా.

రమణయ్య పంతులు అప్రయత్నంగా బొమ్మలోకి చూశాడు. వెంటనే అతని కళ్లు ఆశ్చర్యంతో మెరిశాయి. పుస్తకం తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"ఈ బొమ్మ నాదేనే! మీరెలా వ్రాశారు?" అని అడిగాడు.

"ఇప్పుడే, ఇక్కడే, మిమ్మల్ని చూస్తూ అలా అలా గీసిపారేశాను. బాగుందాండీ?"

రమణయ్య పంతులు బొమ్మను దీక్షగా చూస్తున్నాడు. పెనసలుతో వ్రాసిన రేఖాచిత్రం అది. గుండెలవరకూమాత్రం ఉంది. ముఖంలో విచారము, కళ్లలో నిర్జీవత్వము, కంటికింది చారలు అన్నీ స్పష్టంగా ఆ బొమ్మలో కనిపిస్తున్నాయి. అద్దంలో ముఖం చూసుకుంటున్నట్లు అనుభూతి పొందుతున్నాడు అతను.

"బాగుంది, చాలా బాగుంది" అన్నాడు బొమ్మమీదినుంచి దృష్టి మరల్చుకోకుండానే.

చటుక్కున అతని చేతిలోని పుస్తకం తీసేసుకున్నాడు రాజా. రమణయ్య పంతులు వెలవెలబోయాడు. కాయితంమీద గబగబా ఏవేవో గీతలు గీస్తూ, మధ్య మధ్య నాలుగు కోణాలలోంచి ఆ గీతలలోకి చూస్తున్నాడు రాజా. కొద్దిసేపటికి పుస్తకం మూసి, రమణయ్య పంతులు ముఖంలోకి చూస్తూ మౌనంగా ఉండిపోయాడు. తన చారల సంచీవైపు చూసుకుంటున్నాడు రమణయ్య పంతులు.

"అది సరేగాని, మాస్టారూ, మీరెంతో దిగులుగా కనిపిస్తున్నారు. కారణం తెలుసుకోవచ్చా?" అని రాజా మృదువుగా అడిగాడు.

జవాబు రాలేదు.

"చెప్పండి, మాస్టారూ, సందేహించకండి."

> మానవహృదయం మూగపోయినప్పుడు మాత్రమే దేవుడు చెవిటివాడు అవుతాడు.
>
> —శ్యాక్లెస్

"ఏమీలేదు. ఏమీలేదండి. సాధారణమైన ఇబ్బందులు. అంతే" అన్నాడు. లేచి వెళ్లిపోవాలనుకున్నాడు, అతని చెయ్యి పట్టుకుని తిరిగి కూర్చోబెట్టాడు రాజా.

"చెప్పండి. నాచేతనైన సహాయం చేస్తాను" అన్నాడు.

రమణయ్య పంతులు మాట్లాడలేదు.

"మీకు చెప్పడానికి ఇష్టంలేదు. మీరు పరులకళ్ల సహాయం పొందడానికి అంగీకరించరు. మీ కష్టమేమిటో నాకు తెలుసు. చెప్పనా? మీకు ప్రస్తుతం డబ్బు కావాలి. అవునా?" ఆప్యాయంగా అడిగాడు రాజా.

"మీకెట్లా తెలుసు?"

రాజా పెద్ద పెట్టున నవ్వాడు.

"ఇందులో తెలియడానికేముంది, మాస్టారూ! డబ్బు లేనివాడే ఈ రోజుల్లో విచారంగా ఉంటాడు. డబ్బు దండిగా ఉన్నవాడికి తల్లి చనిపోయినా కన్నీళ్లు రావు! కాదంటారా?" సూటిగా రమణయ్య పంతులు ముఖంలోకి చూస్తూ అడిగాడు రాజా.

ఆలోచనల్లో తిరుగుతున్న అతను మాట్లాడలేకపోయాడు.

"పోనివ్వండి. ఆ గొడవకేంగాని, మీకు నా సహాయం పొందడం ఇష్టమేనా కాదా? మీరు ఊఁ అనండి చాలు. నా శక్తికొద్దీ సహాయపడతాను."

రమణయ్య పంతులికి ఏం చెప్పాలో తోచడంలేదు. ఆశ్చర్యం, ఆనందం అతణ్ణి ముంచెత్తాయి. 'రాజా ఎంత సహృదయుడు! ఇటువంటి మనిషిని తన యాభై ఏళ్ల జీవితంలో ఒక్కసారి చూడలేదు. జరుగుతున్నది నిజమా, కలా? అతను డబ్బు ఇస్తాడా? అయాచితంగా ఎవరైనా సహాయపడటానికి సిద్ధపడితే ఈ రోజుల్లో అసత్యంగానే కనిపిస్తుంది.'

"చెప్పండి, మాస్టారూ, డబ్బు తిరిగి ఇవ్వలేనని సంశయిస్తున్నారా? పోనీ, మీరు ఇప్పట్లో తిరిగి ఇవ్వనక్కర్లేదు. మీకు వీలున్నప్పుడే ఇద్దురుగాని, లేకుంటే లేదు." రాజా రెట్టించాడు.

రాజా మళ్లీ మళ్లీ అడుగుతూంటే రమణయ్య పంతులి ఆలోచన పెరుగుతూంది. 'ఇతని వద్దనుంచి డబ్బు పుచ్చుకోవడమా? మానడమా? ఒక అపరిచితుడు ఇస్తానన్నంత మాత్రంలో, ఎంత కష్టంలో ఉంటేమాత్రం, దానం పట్టినట్టు పుచ్చుకోవలసిందేనా! ఊహుఁ. వద్దు.' ఇలా అనుకున్నప్పటికీ అతని ఆలోచన అంతలోనే మారిపోతూంది. 'ఈ స్థితిలో పుచ్చుకుంటే తప్పేమిటి?' అనికూడా అనిపిస్తూంది. ఏదీ తేల్చుకోలేక సతమతమౌతున్నాడు. తన సమస్యలు, అవసరాలు, తనలోని దుర్బలత్వం డబ్బు పుచ్చుకోమని ప్రోత్సహిస్తున్నాయి. తన ఆత్మ వద్దని చెబుతూంది.

"ఇందులో తప్పేమీలేదు, మాస్టారూ. మనిషికి మనిషే సహాయం చెయ్యకపోతే ఎలా? మీరెప్పుడూ ఎవరికీ సహాయపడలేదూ? సందేహించకండి. మీ అవసరం గడుపుకోండి."

చాలాసేపు మౌనం వహించిన రమణయ్య పంతులు నిస్సహాయంగా తల ఊపాడు.

"హమ్మయ్య, రక్షించారు. మరీ ఇంత మొహమాటఅయితే ఎలా బ్రతుకుతారండీ?" అని నవ్వుతూ చేతిలోని డ్రాయింగ్ పుస్తకం తెరిచాడు రాజా. అందులోనుంచి రమణయ్య పంతులు బొమ్మ ఉన్న కాయితాన్ని చించి, దాని వెనకభాగంలో ఏదో వ్రాయసాగాడు. రమణయ్య పంతులు అయోమయంగా చూస్తున్నాడు. వ్రాయడం పూర్తిచేసి, కాయితం మడతలు పెట్టి అతనికి అందించాడు రాజా. చేతిలోని గాజుపాత్ర జారి కింద పడినట్టనిపించింది రమణయ్య పంతులికి. డబ్బు ఇస్తానని చెప్పి ఈ కాయితం ఇస్తాడేమిటి?

"క్షమించండి, మాస్టారూ. ప్రస్తుతం నాదగ్గిర డబ్బు లేదు. ఇంటివద్ద ఉండిపోయింది. రామారావుపేటలో, కాలేజీకి ఎదురుగా, ఉసిరిచెట్టు ఉన్న ఇల్లే మాది. ఆ ఇంటిలో మా నాన్నగారు ఉంటారు. ఆయనకు ఈ కాయితం చూపించండి. ఆయన పేరు వెంకట్రావుగారు. మీకు తప్పకుండా డబ్బు ఇస్తారు నాన్నగారు. మరేంలేదు, నాకు ఒక గంట పనిఉంది. అంతవరకూ ఇంటికి రాలేను. మీరు వెళ్లి పని పూర్తి చేసుకోండి. తప్పకుండా మీ పని జరుగుతుంది" అంటూ రాజా లేచాడు.

"సెలవు మరి" అంటూ టీవిగా నడిచి వెళ్లిపోయాడు.

రాజా వెళ్లినవైపే చూస్తూ రమణయ్య పంతులు ఆలోచిస్తున్నాడు. 'రాజా విచిత్రమైన మనిషిలా ఉన్నాడు! ఎంత గమ్మత్తుగా తనతో కలిశాడో అలాగే విడిపోయాడు. అబ్బ! తన బొమ్మ ఎంత బాగా

ప్రాణాలు! ... అప్పట్లో ఆ కాయితంమీద ఏం రాశాడో?' ... వెంటనే తెరిచి చదువసాగాడు.

"మహారాజశ్రీ నాన్నగారికి,

నమస్కారం. ఈ కాయితం తీసుకుని వచ్చినాయన కూడా నా తండ్రిలాంటివాడే. పాపం, చాలా కష్టంలో ఉన్నారు. నా బీరువాలో యాభై రూపాయలు ఉన్నాయి. అందులోంచి పదిహేను రూపాయలు తీసి ఈయనకు ఇవ్వండి. బీరువా తాళం మేకుని ఉంటుంది, తెలుసుగా. ఒక గంటలో ఇంటికి వస్తాను. సెలవు. రాజా."

నావమీద సముద్రంలో ప్రయాణిస్తూ దాహంతో కొట్టుకునే సమయంలో దోసెడు మంచి నీరు లభించినట్లయింది రమణయ్య పంతులికి.

'కాని ... ఆ వెంకట్రావుగారు ఇస్తారో ఇవ్వరో?... డబ్బుతో పని! "మీరెవరో నాకు తెలియదు పోవయ్యా" అని ఆయన అంటే? హూ ... ఏమిటో!...'

ఆలోచిస్తూ చాలాసేపు అక్కడే కూర్చున్నాడు. ఆఖరికి అతనిలో ఆశ లేవదీసింది. పార్కు దాటి బాపూరావుపేటవైపు కదిలాడు.

* * *

ఆ ఇంటిని తేలికగానే గుర్తుపట్టగలిగాడు రమణయ్యపంతులు. వీధి తలుపు ఓరగా వేసుకుని నిలబడిన ఒక వృద్ధుడు, కాలేజీ ఆవరణలో ఆడుకునే పిల్లలకేసి చూస్తున్నాడు.

"తమరేనా వెంకట్రావుగారంటే?" ఆ వృద్ధునికి దగ్గరగా వెళ్ళి మర్యాదగా అడిగాడు రమణయ్య పంతులు.

"ఆ... ఆ... మీరెవరో తెలుసుకోవచ్చా?"

"నన్ను రమణయ్య అంటారు. మీతో కొంచెం మాట్లాడాలి."

"రండి" అంటూ వెంకట్రావుగారు లోపలికి నడిచారు. రమణయ్యపంతులు అనుసరించాడు.

"కూర్చోండి" అని కుర్చీ చూపిస్తూ ఆయన కూడా ఎదురుగా ఉన్న ఒక మంచంమీద కూర్చున్నారు.

పార్కులో రాజా కనిపించడం దగ్గరనుంచీ జరిగినది అంతా వివరంగా చెప్పాడు రమణయ్య పంతులు. జేబులోని కాయితం తీసి ఆయనకు అందించాడు. వెంకట్రావుగారు దానిని తాపీగా చదివి, తిరిగి ఇచ్చేశారు. అప్పుడాయన ముఖంలో ఏ భావమూ లేదు.

రమణయ్య పంతులు నిరాశతో వాడిపోయాడు. వెంకట్రావుగారు మౌనంగా ఉండిపోయారు.

"మిమ్మల్ని ఇబ్బందిపెడితే క్షమించండి" అంటూ రమణయ్యపంతులు లేచి నిలుచున్నాడు.

"అహా, ఇబ్బందేమీ లేదు. మీరు కూర్చోండి" అంటూ వెంకట్రావుగారు అతణ్ణి కూర్చోబెట్టారు. జేబులోంచి కొన్ని నోట్లు తీసి అతని చేతిలో ఉంచారు.

"క్షమించాలి. ఇవి ఆయిదు రూపాయలు మాత్రమే. ఇప్పుడు ఈ ఇంటిలో ఉన్నది ఇంతే. బాధలను నేను అర్థం చేసుకోగలను. కాని ఇంతకంటే ఎక్కువ ఇవ్వలేకపోతున్నాను. మీ అవసరానికి వినియోగించండి" అన్నారు.

రమణయ్య పంతులు ఆయన ముఖంలోకే చూస్తున్నాడు.

"మా అబ్బాయి ఇందులో వ్రాసినదానికీ, నేను చేసినదానికీ చాలా తేడా ఉందని కదూ మీరు ఆలోచిస్తున్నారు?"

"కాదు, కాదు. మీ స్థితి ముందుగా నాకు తెలియదు. తెలిసీ మిమ్మల్ని ఎలా బాధించను? నాదేమంత పెద్ద అవసరం కాదు" అన్నాడు. నిజానికి అతను డబ్బు తిరిగి ఇచ్చెయ్యాలనే అనుకున్నాడు. అయినా చేతులు కదలడం లేదు.

కొద్దిసేపు వెంకట్రావుగారు మాట్లాడలేదు. రమణయ్య పంతులు చేతిలోని నోట్లు మంచం పట్టెమీద ఉంచాడు ఆఖరికి.

"చూడండి. డబ్బు ఇవ్వడం నాకు ఇష్టం లేదనుకుంటున్నారు మీరు. నా మాట నమ్మండి. నిజంగా ఈ ఇంట్లో ఎప్పుడూ డబ్బు నిలవ ఉండదు. ఈ మంచము, ఈ ట్రంకుపెట్టె, ఈ గది, గోడలు మీకు చెప్పడంలేదూ ఈ ఇంటి పరిస్థితి? నాకు ఇష్టంలేక కాదు, ఇంతకన్నా ఎక్కువ ఇవ్వగలనేమో ఆలోచించండి" అంటూంటే వెంకట్రావుగారి కంఠం గద్గదికమైంది. ఇక రమణయ్య పంతులు ముఖంలోకి చూడలేక ఎటో చూస్తూ ఉండిపోయారు.

రమణయ్య పంతులు కలవరపడ్డాడు.

"మిమ్మల్ని కష్టపెడితే మన్నించండి" అంటూ ఆయన చేతులు పట్టుకున్నాడు.

"లేదు. మీరేమీ చెయ్యలేదు. అంతా చేస్తున్నది వాడే" అన్నారు ఆయన చేతులు జోడించి బరువుగా కళ్ళు మూసుకుంటూ.

రమణయ్య పంతులికి తన మనోభావాలను ఎలా వ్యక్తం చెయ్యాలో తెలియడంలేదు. ఎంతో బీదరికంలో ఉంటూకూడా తనకు సహాయం చేస్తున్న ఆయనకు మనస్సులోనే జోహార్లు అర్పించాడు.

చాలాసేపు ఎవ్వరూ మాట్లాడలేదు.

"చూడండి, అదిగో, లక్ష్మిలాంటి కోడలు. ఆ అమ్మాయే ఉంటే మా బ్రతుకులు ఇలా ఉండకపోను" అంటూ ఆయన చేతితో గోడవైపు చూపించారు.

> శత్రువు ప్రేమ నటిస్తూ కురిపించే ముద్దులకన్న మిత్రుని దండనే మంచిది.
> —బైబిల్

గోడమీద ఒక అందమైన స్త్రీమూర్తి చిత్రపటం కనిపించింది రమణయ్య పంతులికి. ఆ పటానికి వాడిపోయిన పూలదండ ఒకటి వేలాడుతూంది. దృష్టి మరల్చుకోలేకపోతున్నాడు అతను.

"ఆమె గతించింది. అప్పటినుంచీ కష్టాలలోనే బ్రతకమని శాసించాడు భగవంతుడు." నిర్వేదనగా అన్నారు వెంకట్రావుగారు.

రమణయ్యపంతులు వెంకట్రావుగారి ముఖంలోకి చూస్తూ బరువుగా నిశ్వసించాడు.

"ఆ కరుణామయి, ఆ దేవత వెళ్ళిపోయిన రోజు నుంచీ అబ్బాయి మనస్సు పిచ్చిపోయింది. వాడేం చేస్తాడో వాడికే తెలియదు. మతి చలించింది. వాడు ఏనాటికైనా మామూలు మనిషి కాకపోతాడా అనే ఆశతో బ్రతుకుతున్నాను. పరమేశ్వరుడికి దయలేదు. ఈ కష్టాలు తొలగడం లేదు. నా హృదయంలో ..." వెంకట్రావుగారి గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. ఉత్తరీయంతో కళ్ళు ఒత్తుకుంటున్నారు.

రమణయ్య పంతులి హృదయం కలుక్కుమంది. 'రాజాకి మతి చలించిందా? ... భరించలేని బీదతనం, వృద్ధాప్యం...అందులో కొడుకు మనఃస్థిమితం లేనివాడు కావడం. అబ్బ ... తనైతే నిలబడగలడా?'

కన్నీటి తెరలోంచి వెంకట్రావుగారిని చూస్తూ రమణయ్య పంతులు నిట్టూర్చాడు. అతని హృదయంలో బాధల తరంగాల హోరు ప్రతిధ్వనిస్తూంది. ★




కేశవర్ధిని

నిగనిగలాడే నిడుపాటి కేశములకు.

మా ఇతర తయారీలు:

★ కేశవర్ధిని రెడీమిక్స్‌డ్ హెయిర్ ఆయిల్

★ కేశవర్ధిని షాంపూ (కేక్ & పౌడర్)

★ సౌగంధిక ఫ్లవర్ డస్ట్

మరియు అభ్యంగన చూర్ణము